# కాస్ట్ ఫీలింగ్



విద్యాధికులు పెరుగుతున్న కొద్దీ మనదేశంలో కులతత్త్వం మతతత్త్వం పెరిగిపోతున్న విషయం మనందరికీ తెలుసు. మా కాలనీలో అలాంటి జబ్బు ఎవరికీ లేకపోవటం వల్ల హాపీగా జీవితం గడిపేయగలుగుతున్నాము.

కాని ఆ మధ్య జరిగిన ఓ సంఘటన వల్ల మా అందరి దృష్టి కూడా 'కాస్ట్ ఫీలింగ్' వేపు మళ్ళక తప్పలేదు.

మా కాలనీ కుర్రాడు రాజేష్ ఇంజనీరింగ్ మంచి రాంక్‌లో పాసయి ఉద్యోగాల కోసం వేట మొదలుపెట్టాడు.

సనత్‌నగర్‌లో వున్న ఓ కంపెనీకి మెకానికల్ ఇంజనీర్లు కావాలన్న ప్రకటన చూసి అప్లయ్ చేశాడు. నెల రోజుల్లో ఇంటర్వ్యూ వచ్చిందతనికి. ఇంటర్‌వ్యూలో ఇద్దరే మెకానికల్ ఇంజనీర్లు వచ్చారట. మిగతా వారంతా మెకానికల్ డిప్లొమా హోల్డర్లు. కానీ తమాషా ఏమిటంటే వాళ్ళు డిప్లొమా హోల్డర్స్‌నే సెలక్ట్ చేసుకున్నారు. అందుకు కారణం తరువాత తెలిసింది.

ఆ సెలక్షన్ కమిటీ చైర్మెన్ వాళ్ళందరిలో కేవలం తన కులానికి చెందిన వారినే సెలక్ట్ చేసుకున్నాడట.

ఆ తరువాత రెండ్రోజులకే ఇంకో సంఘటన జరిగింది. మా ఆఫీస్‌లో మా బాస్ గవర్నమెంట్‌ని ముంచేసి ప్రైవేట్ కంట్రాక్టర్‌కి తొంభై లక్షల లాభం కలిగే విధంగా కాంట్రాక్ట్ ఇచ్చి, అందులో సగం డబ్బు తను తినేశాడు. ఈ విషయం తెలిసి, డిపార్ట్‌మెంట్ హెడ్ అతని మీద యాంటీ కర్రప్షన్ వాళ్ళకు కంప్లెయింట్ ఇచ్చాడు. తీరా చూస్తే ఆ హెడ్‌కి తనూ, ఆ కంట్రాక్టర్ ఒకటే కులం వారని తెలిసిందట. అందుకని కంప్లెయింట్ విత్‌డ్రా చేసేసుకున్నాడు.

అలాగే ఒక క్రిస్టియన్ ముఖ్యమంత్రి అంతా క్రిస్టియన్స్‌కే రాష్ట్రంలోని పెద్ద పోస్ట్ లివ్వటం, ఒక రెడ్డి ముఖ్యమంత్రి అంతా రెడ్డీస్‌కే టాప్ పదవులివ్వటం, కోమటి ముఖ్యమంత్రిగారు తమ కులం వాళ్ళందరికీ హోదాలు సమకూర్చటం– ఇలాంటి వన్నీ న్యూస్ పేపర్లలో చదివాం అందరం. ఈ కులమతజాఢ్యాలను ఎలా ఎదుర్కోవాలి అనేది పరిశీలించడానికి మా కాలనీ వాళ్ళంతా ఒక సమావేశం జరపాలని నిర్ణయించుకున్నాం. ఈ కాస్ట్‌ఫీలింగ్స్ అనే సమస్యను మా కాలనీ వాళ్ళంతా తమ అడ్వాన్‌టేజ్‌కి ఎలా వాడుకోవాలో తెలిపేందుకు మీటింగ్ ఏర్పాటు చేశారు. మీటింగ్‌కి జనం కిటకిటలాడిపోయారు.

"సోదర సోదరీమణులారా! ఈ కులమతతత్వాలను సక్సెస్‌ఫుల్‌గా వాడుకోవడానికి సలహాలివ్వవలసిందిగా కోరుతున్నా" అన్నాడు శాయీరామ్.

మరో అరగంటలో డెబ్భయ్ తొమ్మిది సలహాలు అందించారు అనేకమంది. దేనికీ సభ ఆమోదం లభించకపోయేసరికి పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

హఠాత్తుగా శాయిరామ్ మళ్ళీ మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదరులారా! సోదరీమణులారా– పిల్లలారా! యువకులారా" యాదగిరి ఠక్కున అడ్డుపడ్డాడతనికి.

"అది ఒక్కసారంటే చాలుభయ్! పదిసార్లనక్కరలేదు.

శాయిరామ్ అతనివంక కోపంగా చూసి మళ్ళీ సబ్జెక్ట్‌లోకొచ్చేశాడు.

"నన్నడిగితే."

"నిన్నెవరూ అడగలే–" వెనుకనుంచి ఎవరో అరచారు.

"అడిగారు" కోపంగా అన్నాడు శాయిరామ్.

"అడగలే–"

రంగారెడ్డి అతనిని శాంతపరచి సలహా త్వరగా చెప్పమని అడిగాడు.

"నన్నడిగితే మన రాష్ట్రమంతా బాగా దట్టంగా అల్లుకుపోయి ఉన్న ఈ కాస్ట్ ఫీలింగ్‌ని ఏమీ చేయలేము గనుక మనమంతా కూడా కులమతాభిమానాలు ఏర్పరచుకుంటే ఏ

సమస్యా ఉండదు. ఎలావుంది మన అయిడియా?" ఆత్రుతగా ఎగ్జయిటయిపోతూ అడిగాడతను.

జనంలోనుంచి ఎవరూ మాట్లాడలేదు. అందరూ అలా నిశ్శబ్దంగా తనేమీ మాట్లాడనట్లే తనవంక చూడటం గమనించేసరికి అతని ఉత్సాహమంతా నీరుకారి పోయింది. నెమ్మదిగా మా వెనక్కు వచ్చి నిలబడ్డాడు.

హఠాత్తుగా యాదగిరి ఫిట్స్ వచ్చినవాడిలా గిలగిల కొట్టుకుంటూ మైక్ దగ్గరకు దూకాడు.

"జబర్దస్త్ అయిడియా భాయ్! గిప్పుడే లైటెనింగ్ లెక్కవచ్చింది! చెప్పాల్నా?" ఉద్రేకంగా అడిగాడు.

"వద్దు, వద్దు" అరచారు స్టూడెంట్స్.

అయినా యాదగిరి వాళ్ళ మాటలు పట్టించుకోలేదు.

"అదేమంటే! ఈ దునియాల ఇయాళ్రేపు కాస్ట్‌ఫీలింగ్ ఎట్లున్నదో గట్ల మన కాలనీల గూడా కాస్ట్ రెలిజియన్ పీలింగ్స్ గిట్ల ఉన్నట్లు– గంటే నిజంగా ఉన్నట్లు కాదు గానీ ఉన్నట్లు యాక్షన్ గిట్టజేస్తే సమజయినాది? నేను జెప్పెడిదేమంటే కాస్ట్ ఫీలింగ్, రెలిజియన్ ఫీలింగ్ గిట్ట దునియాల ఫైలాయించివుండె. కాబట్టి మనం కాలనీవోళ్ళం గూడ కాస్ట్ రెలిజియన్ ఫీలింగ్సుతోటి గంటే కాలనీల కాదు! కాలనీ బయటన్నమాట. గంటే కాలనీలో కాస్ట్ ఫీలింగుని బయట కాస్టు ఫీలింగు లేకుండా యాక్షన్! కాస్ట్ ఫీలింగ్ రెలిజియన్ ఫీలింగ్ నిజంగ కాస్ట్ ఫీలింగ్ లేకున్నగానీ యాక్షన్ తోటి కాస్ట్ ఫీలింగ్' అక్కడితో ఆపి మొఖానికి పట్టిన చెమటలు తుడుచుకోసాగాడతను ఆయాసంగా.

రంగారెడ్డి ఆప్యాయంగా అతని భుజం తట్టాడు.

"చూడు నాయనా! కొంచెం కన్‌ఫ్యూజన్‌గా ఉన్నట్లుంది. కానీ నువ్ ఏం చెప్పాల్ననుకుంటున్నావో అది నాకు అర్థమయింది. నేను నీ తరపున వీళ్ళందరకూ చెపితే త్వరగా పనయిపోతుంది."

"అవ్ అన్నా! నువ్వేజెప్పు మనకు తెలుగుదేశం వచ్చిన దగ్గర కెళ్ళి తెలుగుభాష కొంచెం కిరికిరిగున్నది."

"సోదరులారా! మన యాదగిరి అభిప్రాయం ఏమిటంటే మనందరం కాలనీ బయటకు పనుల మీద– అంటే ఉద్యోగాల కోసం, ఎడ్మిషన్స్ కోసం– కాక ఇంకే పనయినా సరే వెళ్ళినప్పుడు మనందరికీ కూడా కాస్ట్ ఫీలింగు ఉన్నట్లు యాక్షన్ చేసి ఏం కులం వాళ్ళ దగ్గరకు మన కాలనీలో ఉన్న వాళ్ళ కులం వాళ్ళనే పంపి మన పనులన్నీ చేసుకోవచ్చు."

జనమంతా ఆ సూచన వినగానే తప్పట్లు మోతిక్కించేశారు. మాక్కూడా ఆ ఆలోచన వచ్చింది.

"యాదగిరికి ఇంతమంచి అయిడియా ఎలా వచ్చింది?" మా కాలనీవాళ్ళు చాలామంది ఒకరినొకరు అడుగుతూండటం వినిపించిది మాకు. దాంతో యాదగిరి ఉ పొంగిపోయాడు.

"...నేను మీకిట్ల కనబడుతున్నా గానీ నా చిన్నప్పుడే కెళ్ళే ఫెంటాస్టిక్ అయిడియా లొస్తూండె! ఎరుకనా? నైన్త్‌క్లాసు చదివేప్పుడు ఏమాయెనంటే మా స్కూల్లో చాక్‌పీస్‌లు ఖతమయిపోయినయ్. మార్కెట్లో గూడ లేకుండె. నేనప్పుడేమయిడియా ఇచ్చినానో ఎరుకనా? స్టూడెంట్స్ అందరిండ్లలో చిన్న చిన్న చాక్‌పీస్ ముక్కలుంటయి గదా! గవి తెచ్చి హెడ్‌మాస్టర్‌కిస్తే పని నడుస్తుందని జెప్పినా. ఇగో ఇక జూడు– రెండో దినానికల్లా నాలుగుబస్తాల చాక్‌పీస్ ముక్కలు జమయిపోయినయ్. మా హెడ్మాష్టర్ లేదా, ఖుష్ అయిపోయి నాతో గలీ లగాయించిండు."

"చాలు! పాత సుత్తి వద్దు" అరచారు కొంతమంది.

అప్పటికప్పుడే యాదగిరి సూచనను అమలుపరచటానికి అంతా ఏకగ్రీవంగా వప్పుకున్నారు. దానిప్రకారం ఏమిటంటే కాలనీలో ఎవరికయినా ఏదయినా పనిపడినప్పుడు ఆ ఆఫీసరో, లేక గుమాస్తానో, లేక కమిటీ మెంబరో ఎవరో తెలుసుకుని, అతనే కులమో కనుక్కుని ఆ కులానికి చెందిన మా కాలనీ వ్యక్తిని అతని దగ్గరకు పంపి పని సానుకూలపరచుకోవటం!

ఆ మర్నాడే మొదటి కేస్ వచ్చింది మాకు.

మా కాలనీలోనే ఉంటూన్న భుజంగరాజు తమ్ముడిని ఇంటర్‌లో చేర్పించాల్సి వచ్చింది. ఆ జూనియర్ కాలేజ్ క్రిష్టయన్స్‌ది. కనుక ఆ ప్రిన్సిపాల్ దగ్గరకు మా కాలనీలో వుంటున్న క్రిష్టియన్ టి.జె. యమ్. బాబుని తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాం. వెంటనే అందరం మధుషీల్‌బాబు ఇంటికి చేరుకున్నాం.

"హలో హలో ఏమిటిలా వచ్చారు?" అడిగాడతను.

సంగతంతా చెప్పామతనికి.

"అయిడియా బాగుంది కానీ" అంటూ నసిగాడతను.

అందరం గతుక్కుమన్నాం.

"కానీ!" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి.

"జీసస్ క్రైస్ట్‌కి కోపం వస్తుందేమో! ఎందుకంటే మా బైబుల్లో స్పష్టంగా ఉంది. అబద్ధాలు చెప్పటం మహా పాతకమని"

మాకేం చెప్పాలో తెలీలేదు. అందరం మొఖాలు చూసుకుంటూంటే హఠాత్తుగా శాయిరామ్‌కో అయిడియా వచ్చింది.

"ఆ మాట నిజమేననుకో గురూ! కానీ మీ బైబుల్లోనే ఇంకో సూక్తి కూడా వుంది కదా! "ఏసుక్రీస్తు మిమ్ములను పాపముల నుండి రక్షించును" అని! కనుక ఓ చిన్న

అబద్ధం చెప్పినా జేసస్ క్రైస్ట్ అర్థం చేసుకుని క్షమించేస్తాడు"

"అఫ్‌కోర్స్– అఫ్‌కోర్స్– ఆ మాట నిజమే పదండి" అన్నాడతను. అందరం జూనియర్ కాలేజ్ చేరుకున్నాం. అక్కడ చాలా పెద్ద క్యూ వుంది.

ఓ చిన్న కాగితం మీద 'జాన్ మధుషీల్ బాబు' అని పేరు రాసి లోపలకు పంపించాడతను. వెంటనే మిగతా వాళ్ళందరినీ ఆపేసి మధుషీల్ బాబునీ అతనితో పాటు మమ్మల్నీ కూడా లోపలకు పంపించాడు ప్యూన్.

"కమాన్ మిస్టర్ జాన్ మధుషీల్ బాబూ! సిడౌన్ వీళ్ళంతా ఎవరు" అడిగాడు ప్రిన్సిపాల్ ఆనందంగా.

"అంతా మనాళ్ళే సార్!"

"అంతా మనాళ్ళే?"

"అవున్సార్! అంతా క్రిష్టియన్సే"

"వెరీగుడ్ మధుషీల్ బాబూ! వాట్‌కెన్ అయ్ దూ ఫర్ యూ?"

"వీళ్ళ తమ్ముడికి మన కాలేజ్‌లో సీట్ ఇవ్వాలి సార్. ఇంటర్ ఎంపీసి. గ్రూప్" భుజంగరాజుని చూపుతూ అన్నాడు.

"ఓ! ఎంపీసి.కి చాలా టఫ్ కాంపిటీషన్ మధుషీల్ బాబూ! ఎనీవే మన క్రిష్టియన్ కాబట్టి ఇచ్చేస్తాను."

"థాంక్యూ సార్"

"ఏదీ అప్లికేషన్ ఫారమ్?"

భుజంగరాజు అప్లికేషన్ ఫారమ్ ఇచ్చాడు.

అప్లికేషన్ చూస్తూనే అదిరపడ్డాడు. ప్రిన్సిపాల్!

"వాటీజ్ దిస్? ఇక్కడ హిందూమతం అని ఉందేమిటి?"

మధుషీల్ బాబు చిరునవ్వు నవ్వాడు.

"అప్పట్లో వాళ్ళు హిందువులే సార్! ఈ మధ్యనే మన మతంలో చేరిపోయారు. నేనే చేర్చేశాను"

"ఆర్ యూ ష్యూర్!"

"యస్సార్!" ప్రిన్సిపాల్ కొద్దిక్షణాలు ఆలోచించి భుజంగరాజు వేపు తిరిగాడు.

"ఏ చర్చ్ మీది?" భుజంగరాజు తెల్లమొఖం వేశాడు కానీ వెంటనే బాబు అందుకున్నాడు.

"మా ఎల్.బి.నగర్ చర్చే సార్"

"కాథలిక్సా? ప్రొటెస్టెంట్సా?"

"ప్రొటెస్టెంట్సే సార్!" వినయంగా అన్నాడు భుజంగరాజు.

"ఆ చర్చ్ ఫాదర్ నుంచి సర్టిఫికెట్ కావాలి" అనుమానంగానే అన్నాడు ప్రిన్సిపాల్.

"రేపు తెచ్చిస్తాను సార్"

"అయితే సరే."

అప్లికేషన్ మీద 'ఎడ్మిట్' అని రాసి భుజంగరాజు కిచ్చేశాడు ప్రిన్సిపాల్.

అందరం ఆనందంగా బయటికొచ్చాం.

బయట మా కోసమే చౌదరి ఎదుర్చూస్తున్నాడు.

"గురూ అర్జంటుగా మీ హెల్ప్ కావాలి! మా బామ్మర్దికి లోటస్ కంపెనీలో రేపు ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూ బోర్డ్ మెంబర్స్‌లో ఒకరు కాపు కులమట. రెండో ఆయన బ్రాహ్మణులు. అందుకని..."

కాపులు ఎవరున్నారా అని ఆలోచనలో పడ్డాము.

"ఆ! మన గోపాల్రావ్ కాపులే పదండి! అతనిని తీసుకెళ్దాం" చెప్పాడు రంగారెడ్డి.

అందరం గోపాల్రావ్ వాళ్ళ పత్రికాఫీసుకెళ్ళి అతనిని తీసుకుని ఆ ఇంటర్వ్యూ బోర్డ్ ఛైర్మన్ ఇంటికి వెళ్ళాం.

అప్పుడే ఇంటర్వ్యూకి బయల్దేర బోతున్నాడతను.

"రేపు రమ్మని చెప్పు! ఇవాళ చూడను" అంటూ ప్యూన్‌తో చెప్పేయటం మాకు వినబడుతూనే వుంది.

ఇక లాభం లేదని గోపాల్రావ్ లోపలకు నడిచాడు ప్యూన్‌ని పక్కకి తోసి.

"ఇంతకుముందే ప్యూన్‌తో చెప్పాను కదా– రేపు రండి" కోపంగా అన్నాడతను.

"మనమంతా ఒకటే కాస్ట్ సార్" నవ్వుతూ అన్నాడు గోపాల్రావు.

"అలాగే! మీ ఇంటిపేరేమిటి?"

"ఎండకాలం సార్!"

"ఆ! ఎండాకాలం వాళ్ళా! మీకు తెలుసో తెలీదో మా మదర్ వాళ్ళింటి పేరు కూడా ఎండాకాలం వాళ్ళే"

"తెలుస్సార్ మా అమ్మ ఎప్పుడూ చెపుతూండేవారు. ఫలానా ఎండాకాలం వాళ్ళ కుటుంబం చాలా గొప్ప కుటుంబం అని–"

"అలాగా! చాలా సంతోషం ఇంతకూ ఏం పనిమీదొచ్చారు?"

"మనవాడొకతనికి ఇవాళ మీ కంపెనీలో ఇంటర్వ్యూ వుంది"

"మనవాడేనా?"

"సెంట్ పర్సెంట్"

"పేరు రాసివ్వండి"

గోపాల్రావ్ జేబులోనుంచి కాగితం తీసి అతనికిచ్చేశాడు.

"ఇంటి పేరు 'వి' అని వుంది 'వి' అంటే ఏమిటి?"

" 'వి' అంటే వర్షాకాలం."

"ఆఁ! వర్షకాలమా! కానీ మన కాస్ట్‌లో వర్షాకాలం వాళ్ళెవరూ లేరనుకుంటానే."

"ఇటు సైడ్ లేరు గానీ సూర్యాపేటలో ఉన్నారండీ! అసలు "వర్షాకాలంపల్లి" అనీ ఓ ఊరు ఊరంతా మున్నూరు కాపులదే ఉంది."

"ఓ! అలాగా."

"అవునండీ."

"అయితే సరే."

"థాంక్యూ సార్. వస్తానండి"

"వెల్‌కమ్, వెల్‌కమ్."

అందరం హాపీగా బయటికొచ్చేశాము.

అక్కడ నుంచి రెండో మెంబర్ శర్మగారి ఇంటికి చేరుకున్నాం. ఫ్యాన్‌తో మా కాలనీకి చెందిన శశిధర్ పేరు రాసి పంపించాము లోపలకు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అంటూ శర్మగారే బయటికొచ్చేశారు.

"మా తాతగారి పేరు మీకు తెలిసే వుంటుంది. సోమేశ్వరశర్మ అనీ–"

"మీ ఇంటిపేరేమిటి?"

"శీతాకాలం సార్."

"అరె! మీరు శీతాకాలం సోమేశ్వరశర్మ గారి మనుమలా!"

"అవున్సార్."

"రండి.కూర్చోండి! మా బావగారింటి పేరు కూడా శీతాకాలం వాళ్ళే–"

"మా తాతగారే ఆ విషయం చెప్పి పంపించారు సార్. మనమంతా ఒకటే. ఏం ఫరవాలేదు వెళ్ళమన్నారు."

"చాలా సంతోషం! చాలా సంతోషం! యింతకూ ఏమిటి పని."

"మనవాడు ఒకతనికి మీ కంపెనీలో ఇంటర్‌వ్యూ వచ్చిందట."

"ఓహెూ అదా సంగతి! ఆ కాండేట్‌మనవాడేకదా?"

"పూర్తిగా మనాడేనండీ"

"వైదీకులా? నియోగులా?"

"మనాళ్ళే."

ఏదీ పేరు రాసివ్వండి."

చౌదరి ఠక్కున పేరు రాసిచ్చేశాడు.

"వి అంటే ఏమిటి?"

"అదేసార్! వర్షాకాలం."

"వర్షాకాలం పేరు మన కాస్టులోలేదే"

"రాయలసీమలో ఉందంటండీ."

"అవునండీ "వర్షాకాలం అగ్రహారం" అనీ ఒక ఊరుఊ రంతా మన కాస్ట్‌వాళ్ళే– అది మన శాఖ వాళ్ళే ఉన్నారు" చెప్పాడు చౌదరి.

"సరే. తప్పకుండా సెలక్ట్ చేసేస్తాను. సెలక్టయిపోయాడనే అనుకోండి."

"చాలా థాంక్స్ సార్ మన శీతాకాలం వాళ్ళమీద అంత అభిమానం ఉన్నందుకు"

"దాన్దేముందిలే! మనం మనం సహాయం చేసుకోపోతే ఎలా? మిగతా కులాల వాళ్ళందరూ కలసి మనకులాన్ని ఎలా అణగ ద్రొక్కేస్తున్నారో మీరూ చూస్తున్నారుగా!"

"అవునండీ. చూస్తున్నాం."

అందరం ఆనందంగా వచ్చేశాం అక్కడినుంచి.

"మర్నాడు పొద్దున్నే ఇంకో కేస్ వచ్చింది మా దగ్గరకు. రవిప్రకాష్ వాళ్ళ తమ్ముడికి పోలీస్‌డిపార్టుమెంట్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్ పోస్టుకి ఇంటర్వ్యూ వచ్చిందట.

"సంగతేమిటంటే గురూ. మేము కాపులం! ఇంటర్‌వ్యూ చేసేవాళ్ళు ఇద్దరిలో ఒకరు కమ్మకులం, ఇంకొకరు రెడ్డి. విజయవాడ రంగా గొడవల వల్ల పోలీస్ డిపార్టుమెంట్ లోకి కాపులను తీసుకోరేమోనని నా అనుమానం కనుక.."

అప్పటికప్పుడే టాక్సీ తెప్పించాడు రంగారెడ్డి. ముందు అందరం శివారెడ్డి గారింటికి చేరుకున్నాం.

రంగారెడ్డి అన్న పేరు చూస్తూనే ఆప్యాయంగా బయటికొచ్చి పలుకరించాడతను.

"ఏ ఊరు మీది?"

"గుంటూరు" అన్నాడు రంగారెడ్డి.

"మీదే ప్రాంతం సార్?"

"కడప."

"ఓ! కడపా! మా తాతగారి స్వస్థలం కూడా కడపే"

"అలాగా! మీ ఇంటిపేరేమిట?"

"సంధ్యాకాలం–"

"ఓ సంధ్యాకాలం వారా? మా బంధువులు చాలామందున్నారు 'సంధ్యాకాలం' వారు'

"అవున్సార్– సంధ్యాకాలం వాళ్ళంటే మాటలా? మనాళ్ళు ఒకప్పుడు మొత్తం దక్షిణ దేశానంతా పరిపాలించిన చక్రవర్తులని మా తాతగారు చెప్తూండేవారు"

"అవునవును! చాలా గ్రేట్ మనాళ్ళు. ఇంతకూ ఏమిటి పని?"

సంగతంతా చెప్పాడు రంగారెడ్డి.

"ఆ కాండేట్ మన రెడ్లేనా?"

"ప్యూర్ రెడ్డీస్ సార్."

"పేరేంటి."

"శ్రావణమాసం శంకర్రావు"

"శంకర్రావ్ ఏమిటి? శంకర్ రెడ్డి' అని ఉండాలిగా!"

"ఒకప్పుడు ఉండేదేనండీ! కానీ వాళ్ళ తాతయ్య కొంచెం చాంధసుడవటం వల్ల పోయింది?"

"అదేంటి?"

"ఆయనకు మరీ ఆధునిక పిచ్చి ఎక్కువ సార్! కులాలూ, మతాలూ ట్రాష్! మానవకులం ఒక్కటే ప్రపంచంలో ఉండాలి అని ఊళ్ళన్నీ తిరిగి చాలా న్యూసెన్స్ చేస్తూండేవాడు. అక్కడితో ఆగక పేర్ల వెనుక కులాలు ఉండడం వల్లే కులతత్వాలు ప్రబలి పోతున్నాయని వాళ్ళ కుటుంబంలో అందరి పేర్ల వెనుక రెడ్డి అనేది తీసిపారేశాడు."

"బహుశా పిచ్చి ఎక్కి ఉంటుంది" అనుమానంగా మాట్లాడాడు అతను.

"ఖచ్చితంగా పిచ్చే సార్! లేకపోతే కులాలు లేకుండా చేయుటమేమిటండీ నా మొఖం."

"ఆయన భ్రమ! కులం లేకుండా మనిషెలా ఉంటాడు?"

"నూరుపాళ్ళూ భ్రమేనండీ."

"అయినా కులాలు తెలీపోతే మనాళ్ళకు సహాయం ఎలా చేసుకుంటాం! ఆ మాత్రం కామన్‌సెన్స్ కూడా లేకపోయిందాయనకు!"

"అవున్సార్! బొత్తిగా కామన్సెన్స్ లేని పనండీ అది."

"సరే మనాడిని నేను సెలక్ట్ చేసేస్తాన్లే"

"థాంక్యూ సార్."

అక్కడి నుంచి కనకయ్య చౌదరి గారింటికి చేరుకున్నాం పదినిమిషాల తర్వాత బయటికి వచ్చారాయన.

"ఏం కావాలి మీకు" అన్నాడు చిరాకుగా గడపదగ్గరే నిలబడి.

చౌదరి ఠక్కున లేచి నిలబడ్డాడు.

"నా పేరు చౌదరండీ! వీళ్ళంతా కూడా మనాళ్ళే."

ఆయన మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"మనాళ్ళేనా! రండిమరి. బయటే కూర్చున్నారేం?"

అందరం లోపలికెళ్ళి సోఫాల్లో కూర్చున్నాం.

"మీ ఇంటిపేరేమిటి?" చౌదరినడిగాతను.

"సాయంకాలం సార్."

"ఓహోహో సాయంకాలం వారా? సరిసరి! ఉయ్యూరు ప్రాంతం కదూ మీది?"

"అవునండీ!"

"అక్కడే వూరు?"

"చిన ఓగిరాలండీ."

"అలాగా మాది పెద ఓగిరాల."

"అబ్బ- చాలా దగ్గరేనండీ మనం. తెగ దగ్గరండీ- జస్ట్ ఆ వంతెన అడ్డం"

"వీళ్ళంతా కూడా చిన ఓగిరాలేనా?"

"కాదండి రాయలసీమలో పెద రామలీలండీ."

"చాలా చాలా సంతోషం- యింతకూ ఏం పనిమీద వచ్చారు?"

సంగతంతా చెప్పాడు చౌదరి.

"ఆ కుర్రాడు మనాడేనా?"

"మన సొంతకులం సార్."

"పేరు రాసివ్వండి"

రవిప్రకాష్ ఠక్కున వాళ్ళ తమ్ముడిపేరు రాసిచ్చేశాడు.

"ఇంటిపేరు మాయాకాలం అని ఉందేమిటి?"

"అదా- అదీ మాయాకాలం అనీ రాయలసీమలో మనాళ్ళకు ఆ ఇంటిపేరు చాలా ఫేమస్ అండీ! అసలు ఓ ఊరిపేరే "మాయకాలమూరు" అనీ అంతా మనాళ్ళతో నిండి ఉంది."

"అసలు బెసిగ్గా వాళ్ళంతా హర్యానా నుంచి రెండొందలేళ్ళ క్రితం కాకతీయ సామ్రాజ్యానికి వచ్చారటండీ! ఆ తరువాత అందులో కొంతమంది రాయలసీమకు వలసవెళ్ళారు".

"ఐసీ- సరే- ఎలాగో మూడొంతుల మంది సబిన్స్పెక్టర్లను మన కాస్టువాళ్ళనే సెలక్టు చేయాలనుకుంటున్నా! మీవాడిని తప్పకుండా చేసేస్తా."

"థాంక్స్ సార్- చాలా థాంక్స్ సార్- చాలా గొప్ప సహాయం చేస్తున్నారు మీరు."

"కులం మీద ఆమాత్రం అభిమానం లేకపోతే ఎలాగోయ్. మీరు కూడా మన కాస్ట్ వాళ్ళందరికీ సహాయం చేయండి. లేకపోతే మన కాస్ట్ వాళ్ళు పైకెలా వస్తారు."

"అలాగేసార్"

అందరం తిరిగివచ్చేశాము.

ఆ తరువాత వారం రోజుల్లో ఇదే పద్ధతిలో అన్ని కులాల వారికి 'కాస్ట్ఫీలింగ్' పేరుతో ఎన్నో కార్యక్రమాలు జరిపించేశాము.

చివరి రోజున మాత్రం ఓ కేస్ విషయంలో కొంచెం గొడవయింది.

నర్సరాజు గారింటికి ఓ పెద్ద రికమండేషన్ కోసం వెళ్ళాం. మా శంకర్రావుకి హైద్రాబాద్ నుంచి వరంగ్‌లకి బదిలీ చేశారు. ఆ బదిలీ రద్దు చేయించాలి.

రాజుగారు చిరునవ్వుతో ఆదరంగా పలుకరించారు మమ్మల్ని.

"ఎవరండీ మీరు?"

"నా పేరు భీమరాజండీ! మాది కూడా భీమవరమే."

ఆ మాటతో అమాంతంగా నర్సరాజు లేచి భీమరాజుని ఆనందంగా కౌగలించు కుంటాడని ఊహించాం మేం.

"మీదేవూరు అని నేనడగలేదు! తెల్సిందా?" అంటూ రివర్సయ్యాడతను.

భీమరాజు కొంచెం కంగారుపడ్డాడు.

"అఫ్‌కోర్స్ అడగలేదండీ."

"అడగనప్పుడు అలాంటివి చెప్పకూడదు- ఇంతకూ పనేంటి?"

"మరేంలేదండీ! వీళ్ళంతా కూడ మన కాస్ట్ వాళ్ళే."

"వీళ్ళదే కాస్ట్ అని నేను అడిగానా?" మళ్ళీ కోపంగా అడిగాడతను.

"లేదండీ"

"మరెందుకా పిచ్చివాగుడు?"

భీమరాజు ఇంకొంచెం బెడిరిపోయాడు.

"సంగతేమిటంటేనండీ మన కాస్టతను శంకర్రావుకి వరంగల్ బదిలీ అయిం దండీ. అది కాన్సిల్ చేయిస్తే మన కులానికే సహాయం చేసిన వారవుతారు."

"షటప్! ఇంకోసారి కులం పేరెత్తుతే బయటకు గెంటేస్తాను" ఉద్రేకంగా అన్నారాయన.

అందరం తెల్లబోయాం.

"ఇంతకూ 'మనకాస్ట్' అంటున్నారు! మీరేం కాస్ట్ అసలు?" కోపంగా అడిగాడాయన.

"అదే సార్! రాజులం."

"నేను రాజు కాస్ట్ అని ఎవరు చెప్పారు మీకు?"

"తెలిసిందండి"

"గాడిద గుడ్డు తెల్సింది. మేము రాజులు కాదు."

"మరి మీ పేరు.."

"నర్సారాజు అన్న పేరున్నంత మాత్రాన నేను రాజు కాస్ట్ అవాలని రూలుందా?"

"లేదనుకోండి"

"లేదనుకోండి కాదు- లేదు!. అందుకు ఉదాహరణ నేనే."

"పోనీ మీరే కాస్ట్ సార్- మా కాలనీలో అన్ని కులాల వాళ్ళూ ఉన్నారు."

"గెటౌట్! అసలు- నాకు ఈ కులాలంటేనే అసహ్యం! నా దగ్గర ఈ కులాల ప్రసక్తి తెచ్చినందుకు ఈ శంకర్రావుని శ్రీకాకుళం బదిలీ చేస్తున్నాను. రెండు నిమిషాలు టైమిస్తున్నాను. ఈలోగా మీరంతా మా కాంపౌండ్ వదలివెళ్ళాలి! ఇంకా చూస్తారేమిటి? గెటౌట్! లేకపోతే పోలీసుని పిలిచి పట్టిస్తానందరినీ"

అందరం ఒక్క నిమిషంలో కాంపౌండ్ వదిలేశాము.

మర్నాడే శంకర్రావు భోరున ఏడుస్తూ సామాను తీసుకుని శ్రీకాకుళం వెళ్ళిపోతుంటే మాక్కూడా ఏడుపొచ్చేసింది.

"ఇదంతా మనవల్లే జరిగింది" అన్నాడు రంగారెడ్డి.

"అవును! మనం తీసుకున్న పాలసీ అంత బావున్నట్లు లేదు" అన్నాడు శాయిరాం.

ఇది జరిగిన రెండు రోజులకే అంతవరకూ మేమాడిన నాటకాల ఫలితాలన్నీ వచ్చేశాయి.

జూనియర్ కాలేజీలో మా కాలనీ కుర్రాడికి సీట్ రాలేదు. చౌదరి గారి బామ్మర్దీ, రవిప్రకాష్ తమ్ముడూ కూడా ఉద్యోగాలకు సెలక్ట్ కాలేదు.

ఎందుకిలా జరిగిందా అని అందరం తర్జనభర్జనలు పడుతూంటే శ్యామల్రావ్ చిరునవ్వుతో వచ్చాడు మా దగ్గరకు.

"మా చెల్లెలి కొడుక్కి అదే జూనియర్ కాలేజీలో ఎంపీసీ సీట్ దొరికిందయా! మా పెద్దమ్మ గారబ్బాయికి లోటస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. మా బామ్మర్ది పోలీస్ డిపార్టుమెంట్‌లో సెలక్టయ్యాడు. మన శంకర్రావుని మళ్ళా హైద్రాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించేశాను" అంటూ చెపుతూంటే మాకు మతిపోయినట్లయింది. ఎందుకంటే అతనిది వీళ్ళందరికీ చెందని వేరే కులం! అయినా అతను అన్నీ సాధించాడంటే నమ్మకం కలగటం లేదు.

"మేము కాస్ట్‌ఫీలింగ్ తీసుకెళ్ళినా పనులవలేదు. మీకెలా అయాయ్ మరి?" అడిగాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

శ్యామలరావ్ ఘొల్లున నవ్వాడు.

"పిచ్చివాళ్ళల్లారా! కాస్టూ, రెలిజియనూ, రక్తసంబంధం వీటన్నింటినీ మించిన ఫీలింగ్ ఒకటుంది! మీకు ఆమాత్రం జనరల్ నాలెడ్జ్ కూడా లేదంటే నాకు ఆశ్చర్యంగా వుంది."

"కాస్ట్ ఫీలింగ్‌ని మించిన ఫీలింగ్ ఒకటుందా?"

"అవును...నేను దాన్ని ఉపయోగించే పనులన్నీ సాధించాను"

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాము.

"కాష్ ఫీలింగ్! అంటే మనక్కావలసిన పనులు డబ్బు పడేసి సాధించుకోవటం. ప్రస్తుతం ప్రపంచమంతా కాష్ ఫీలింగ్‌మీదే నడుస్తోంటే ఇంకా కాస్ట్‌ఫీలింగ్‌ని పట్టుకుని వేలాడుతూ పైగా పెద్ద తెలివిగల పని చేస్తున్నట్లు ఫోజులు కొడుతున్నారా?"

మేము మాట్లాడకుండా అక్కడి నుంచి జారుకున్నాం.

"నాకు తెలుసు! యాదగిరి కెప్పుడూ ఇలాంటి ఫాల్తూ అయిడియాలే వస్తుంటాయి" అన్నాడు శాయిరామ్.

యాదగిరి ఆ మాట విననట్లు వాళ్ళింటివేపు వెళ్ళిపోయాడు హడావుడిగా.